

స్తోత్ర గాన ఝురి

విశాఖ: టీటీడీ కల్యాణ మండపంలో 'స్తోత్ర గాన ఝురి' ఆధ్యాత్మిక కార్యక్రమం ఆద్యంతం అలరించింది.



మలేషియాకు కోలాట బృందం

విశాఖ: మలేషియాలో జరగనున్న శ్రీనివాస కల్యాణంలో పాల్గొనేందుకు సీతమ్మధారకు చెందిన సాయి కోలాటం సభ్యులు ఎంపికయ్యారు.

వర్షసూచన



అనకాపల్లిటౌన్: రాగల నాలుగు రోజులు మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6న 18, 7న 15, 8న 8, 9న 2 మి.మీ., 34.1 నుంచి 34.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయన్నారు.

న్యూస్‌రీల్

డీఆర్వోగా దయానిధి నియామకం



సాక్షి, అనకాపల్లి: జిల్లా రెవెన్యూ అధికారిగా బి.దయానిధి నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన విజయవాడ కమిషనర్ కార్యాలయంలో వీఆర్‌లో ఉన్నారు. ఇన్‌చార్జి డీఆర్వోగా వ్యవహరిస్తున్న ఎస్.డి.అనితను విజయనగరం డీఆర్వోగా నియమించారు. ఇక్కడ డీఆర్వోగా పనిచేసి ఇటీవల దీర్ఘకాలిక సెలవు పెట్టిన వెంకటరమణను కృష్ణా జిల్లాకు అదే హోదాలో బదిలీ చేశారు. కొత్త డీఆర్వో దయానిధి బుధవారం ఉదయం బాధ్యతలు స్వీకరించనున్నారు.

8న రేబాక ప్రభుత్వ కళాశాలలో శిక్షణ

అనకాపల్లి టౌన్: రేబాక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీ నుంచి పలు కోర్సులలో ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కస్టమర్ కేర్, ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ నాన్ వాయిస్ వంటి కోర్సుల్లో శిక్షణకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమాలో ఉత్తీర్ణత సాధించిన యువతీ యువకులు హాజరు కావచ్చన్నారు. మరిన్ని వివరాలకు 7013342667, 8143229228 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ

- విద్యార్థి మరిచిపోయిన సెల్‌ఫోన్‌ను అందజేసిన వైనం



విద్యార్థికి సెల్‌ఫోన్ అందజేస్తున్న డ్రైవర్ నానాజీ

రావికమతం : తన ఆటోలో ప్రయాణం చేసిన ఒక విద్యార్థి మర్చిపోయిన సెల్‌ఫోన్‌ను ఆ విద్యార్థికి తిరిగి అందించి కొత్తకోటకు చెందిన ఆటో డ్రైవర్ సబ్బి నానాజీ శభాష్ అనిపించుకున్నాడు. నానాజీ నర్సీపట్నం నుంచి మంగళవారం వస్తుండగా నాయుడుపాలెం గ్రామానికి చెందిన విద్యార్థి తమరాన పవన్‌కుమార్ ఆ ఆటో ఎక్కాడు. కొత్తకోటలో ఆటో దిగి కంగారుగా సెల్‌ఫోన్ మర్చిపోయి వెళ్లిపోయాడు. నానాజీ ఆ సెల్‌ను గమనించి తమ ఆటోయూనియన్ నాయకులకు చెప్పి ఆ విద్యార్థి అడ్రస్ తెలుసుకుని సెల్‌ఫోన్‌ను తిరిగి అందజేశాడు. దీంతో నానాజీని పలువురు అభినందించారు.

వర్షాలతో వరి పొలాలకు ఊపిరి



శింగవరం పొలాల్లో చేరిన వర్షం నీరు

బుచ్చెయ్యపేట: ఉరుములు, మెరుపులతో మంగళవారం కురిసిన భారీ వర్షం వ్యవసాయదారుల్లో ఆనందం నింపింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తీవ్ర ఎండ కాసింది. రెండు గంటల ప్రాంతంలో ఆకాశంలో చల్లని కారుమబ్బులు కమ్ముకుని కుంభవృష్టి కురిసింది. నెలన్నర రోజులుగా వర్షాలు లేక వడలిపోతున్న ఖరీఫ్ వరి పొలాలకు పూర్తి స్థాయిలో నీరు చేరింది. ఇప్పటి వరకు బీటలు వారిన పంట పొలాల్లో వర్షం నీరు చేరింది. జోరు వానతో రోడ్లన్నీ జలమయం కావడంతో వాహనదారులు కాసింత ఇబ్బంది పడ్డారు. గెడ్డలు, వాగులు నీటితో ప్రవహించాయి.

అక్రమ కలప రవాణా నిరోధానికి నిరంతర గస్తీ



సిబ్బందితో మాట్లాడుతున్న స్క్వాడ్ డీఎఫ్‌వో సోమసుందరం

గొలుగొండ: కలప అక్రమ రవాణా జరగకుండా సిబ్బంది నిత్యం గస్తీ నిర్వహించాలని ఉత్తరాంధ్ర స్క్వాడ్ డీఎఫ్‌వో సోమసుందరం చెప్పారు. ఆయన మంగళవారం కృష్ణదేవిపేట రేంజ్ పరిధిలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అటవీ పరిధిలో ఉన్న వనాల రక్షణ కోసం సిబ్బంది పనిచేయాలని, నిత్యం గస్తీ నిర్వహించాలని పేర్కొన్నారు. అన్ని ప్రాంతాల్లో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. కృష్ణదేవిపేట రేంజ్ పరిధిలో అక్రమంగా కలప రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రేంజ్ అధికారి రంగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



ఏయూలో సర్వేపల్లి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి బొత్స, వీసీ ప్రసాదరెడ్డి, ఎంపీ సత్యవతి





రాష్ట్ర గురుపూజోత్సవంలో మాట్లాడుతున్న విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, వేదికపై డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ డాక్టర్ సత్యవతి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మేయర్ హరివెంకటకుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రవీణ్ ప్రకాష్, శ్యామలరావు, తదితరులు.. సభలో పాల్గొన్న విద్యావేత్తలు, పురస్కార గ్రహీతలు

విజ్ఞాన జ్యోతులు.. విద్యాకాంతులు

- అట్టహాసంగా రాష్ట్ర స్థాయి గురుపూజోత్సవం
- 196 మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులకు అవార్డుల ప్రదానం
- హాజరైన మంత్రులు బొత్స, బూడి, గుడివాడ, రాష్ట్ర విద్యాశాఖ అధికారులు



గురువులకు వందనమంటూ బాలికల నృత్య నీరాజనం

ఏయూక్యాంపస్ : గురువులకే గురువుగా.. ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన సర్వేపల్లి రాధాకృష్ణన్ నడయాడిన ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయ దినోత్సవం అట్టహాసంగా జరిగింది. రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో కట్టమంచి రామలింగారెడ్డి స్నాతకోత్సవ మందిరంలో మంగళవారం జరిగిన ఈ వేడుకలకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో కలిసి సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగాన్ని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, ప్రధాని మోదీ ప్రసంగాన్ని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు చదివి వినిపించారు. రాష్ట్ర విద్యారంగంలో జరుగుతున్న సంస్కరణలు, తద్వారా వస్తున్న సత్ఫలితాలను ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు సాధించిన పలువురు వివరించారు. పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయ, సాంకేతిక విద్య, నైపుణ్య శిక్షణ విద్య విభాగాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపిన 196 మంది అధ్యాపకులకు రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా పురస్కారాలు ప్రదానం చేశారు.

కళా ప్రదర్శనలు అదుర్స్

రాష్ట్ర స్థాయి గురుపూజోత్సవంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు కట్టిపడేశాయి. ముందుగా గణనాయక స్వాగత నృత్యంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. చంద్రంపాలెం పాఠశాల చిన్నారులు మా తెలుగు తల్లికి.. అంటూ చేసిన నృత్యం అలరించింది. గోపాలపట్నం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు స్వాగత నృత్యం, గాజువాక జెడ్పీహెచ్ఎస్ విద్యార్థుల గురుబ్రహ్మ, గురువిష్ణు, గురుదేవో మహేశ్వర, నడుపూరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థుల దండమో దండాలు సారు...మాస్టారు... అంటూ చేసిన శాస్త్రీయ, జానపద నృత్యాలు వారి ప్రతిభకు నిదర్శనంగా నిలిచాయి. ఏయూ నృత్య, సంగీత విభాగం విద్యార్థులు చేసిన కాళీయమర్ధనం రూపకం, వందనం, మా వందనం, గురు వందనం అంటూ చేసిన గురుపూజ రూపకం ఎంతగానో ఆకట్టుకుంది. ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్ రచించిన గేయం ఈ సందర్భంగా వేదికపై వినిపించారు. విద్యా రంగంలో చేపడుతున్న నూతన మార్పులు, ప్రగతిపై ప్రత్యేకంగా తీర్చిదిద్దిన వీడియో గత నాలుగేళ్లుగా జరుగుతున్న అభివృద్ధిని కళ్లకు కట్టినట్లు చూపింది.

ఏర్పాట్లు భేష్

అవార్డు గ్రహీతలకు వేదిక కుడి వైపున కూర్చోవడానికి ఏర్పాట్లు చేశారు. మరో వైపున వారి కుటుంబ సభ్యులు, అతిథులు కూర్చున్నారు. హాజరైన ప్రతీ ఒక్కరికీ మంచి నీరు, అల్పాహారాన్ని వారి వద్దకే తీసుకువెళ్లి పంపిణీ చేశారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. సువిశాలమైన ప్రాంగణంలో, పార్కింగ్ సదుపాయాలు ఉన్న ఏయూలో కార్యక్రమం నిర్వహించడంతో ఎటువంటి ఇబ్బందులు ఎదురవలేదు.

అభినందించిన ప్రవీణ్ ప్రకాష్

రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ అభినందించారు. అవార్డు గ్రహీతల గ్యాలరీకి వెళ్లి వారిని పేరుపేరునా పలకరిస్తూ, శుభాకాంక్షలు తెలిపారు.

ఏయూ కర్మభూమి

ఆంధ్ర విశ్వవిద్యాలయం స్నాతకోత్సవ మందిరం వేదికగా ఈ కార్యక్రమం నిర్వహించడంపై పలువురు సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ ఇదే విషయాన్ని గుర్తుచేస్తూ ఏయూతో సర్వేపల్లికి ఉన్న అనుబంధాన్ని వివరించారు. పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ మాట్లాడుతూ సర్వేపల్లి ఏయూలో పనిచేసిన తర్వాత ఉపరాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా ఒక నూతన మార్గంలో ప్రగతి సాధించిన విధానాన్ని వివరించారు. ఏయూ కర్మభూమిగా నిలుస్తుందన్నారు.

ఏయూ వేదికగా అవార్డు తీసుకుంటున్న ఉపాధ్యాయుల జీవితాలు కొత్త మలుపు తిరుగుతాయని, మరింత ఉన్నత ప్రగతి సాధ్యపడుతుందని ప్రశంసించారు. అనకాపల్లి ఎంపీ బి.వి.సత్యవతి, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, వేపాడ చిరంజీవరావు, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి, ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు, స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్, ఇంటర్ విద్యా కమిషనర్ సౌరభ్ గౌర్, స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కమిషనర్ కె.భాస్కర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నాగరాణి, ఉపాధి శిక్షణ కమిషనర్ బి.నవ్య, కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, డీఈవో ఎల్.చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

గురువుకే అగ్రస్థానం



రాధకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎంపీ సత్యవతి

- జిల్లా ఉపాధ్యాయుల సేవలు ప్రశంసనీయం
- గురు పూజోత్సవంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎంపీ సత్యవతి

తుమ్మపాల: ఏ రంగం, ఏ స్థాయిలో ఉన్నా గురువుకు ప్రథమస్థానం ఉంటుందని జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. స్థానిక గాంధీనగరం జీవీఎంసీ కల్యాణమండపంలో మంగళవారం గురు పూజోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని చెప్పారు. జిల్లాలో ఉపాధ్యాయులు బాధ్యతగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. కాలానుగుణంగా ప్రతి ఒక్కరూ ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. విద్యతోపాటు జ్ఞానాన్ని నిస్వార్థంగా అందిస్తూ భావిభారత పౌరులను తీర్చిదిద్దే అత్యున్నత స్థానం ఉపాధ్యాయులదేనన్నారు. ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తున్నందున ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేస్తూ విద్యార్థుల భవితవ్యాన్ని తీర్చిదిద్దే దిశగా పయనిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరి మదిలో గురువుకు ప్రత్యేకస్థానం ఉంటుందని ఎంపీ బి.వి.సత్యవతి అన్నారు. సమాజతత్వాన్ని తీర్చిదిద్దడం ఒక్క గురువు వల్లే సాధ్యమవుతుందని చెప్పారు. దేశంలో రెండో రాష్ట్రపతిగా, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉప కులపతిగా చేసిన వ్యక్తి సర్వేపల్లి రాధాకృష్ణన్ అని కొనియాడారు. అంతకుముందు బాలబాలికలు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 63 మందిని కలెక్టర్, ఎంపీలు సన్మానించి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.







విశాఖలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రి అమర్‌నాథ్ చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకుంటున్న అనకాపల్లి జిల్లా ఉపాధ్యాయులు కొట్టాన రాంబాబు మాష్టారు, చరకాపు వెంకటలక్ష్మి, కేజియారాణి, సబిత లక్ష్మి, కె.అన్నపూర్ణ

అతి వేగం.. తీరని విషాదం

- ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ప్రైవేటు బస్సు
- ఒకరు మృతి, 14 మందికి గాయాలు
- ఆరు మాసాల చిన్నారి పరిస్థితి విషమం



ప్రమాదానికి గురైన బస్సు



బస్సులో చిక్కుకున్న రమేష్ మృతదేహం, (ఇన్‌సెట్) మృతుడు రమేష్ (ఫైల్)



తీవ్రగాయాలతో ఆరు నెలల చిన్నారి మోక్షిత్

నక్కపల్లి: జాతీయరహదారిపై నక్కపల్లి సమీపంలో ఆగి ఉన్న లారీని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరో 14 మంది తీవ్రగాయాల పాలయ్యారు. డ్రైవరు అతి వేగంగా బస్సును నడపడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగింది. పార్వతీపురం నుంచి గుంటూరు వెళ్తున్న సాయికృష్ణ ప్రైవేటు ట్రావెల్ బస్సులో సుమారు 40 మంది ప్రయాణిస్తున్నారు. వీరంతా వేర్వేరు ప్రాంతాలకు వెళ్లేందుకు పార్వతీపురం, బొబ్బిలి, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లిలలో బస్సు ఎక్కారు. బస్సు అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో నక్కపల్లి దాటిన తర్వాత కిలోమీటరు దూరంలో మనబానవానిపాలెం రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొట్టినట్లు ప్రయాణికులు తెలిపారు. అనకాపల్లిలో జరిగిన వివాహానికి హాజరై తిరిగి వెళ్తున్న విజయవాడ సమీపంలో గొల్లపూడి గ్రామానికి చెందిన బైపాన రమేష్ (35) బస్సులోనే చిక్కుకుని అక్కడికక్కడే మరణించారు. ఇదే ప్రమాదంలో ఆయన భార్య బైపాన కుమారి, కుమారుడు మోక్షిత్ (ఆరు నెలలు)తోపాటు 14మంది గాయపడ్డారు. బస్సు ముందు భాగంలో కూర్చున్న రమేష్ సీట్లో ఇరుక్కొని అక్కడిక్కడే ప్రాణాలు విడిచారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లలో నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. స్వల్ప గాయాలైన వారిని ప్రాథమిక చికిత్స అనంతరం వారి ప్రాంతాలకు పంపించారు. ఆరు నెలల మోక్షిత్ తలకు బలమైన గాయాలయ్యాయి. ఇతని పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం విశాఖ తరలించారు. సంఘటన స్థలాన్ని నర్సీపట్నం ఏఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా, నక్కపల్లి సీఐ అప్పన్న పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారి నుంచి వివరాలు సేకరించారు. మృతుడి భార్య కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పోలీసులు తెలిపారు.

క్షతగాత్రుల వివరాలివి..

గొర్ల బలరామం (దేవరపల్లి, బొబ్బిలి), ఎ.గణేష్‌కుమార్ (పార్వతీపురం), ఎస్.వెంకటవరప్రసాద్ (బొబ్బిలి), చిలకంట నరేంద్ర (బెంగళూరు), చంద్ర (బెంగళూరు), అల్లు శాంతారాం (పార్వతీపురం), గొల్ల శిరీష (పార్వతీపురం), ముప్పాల వర్షిత (బొబ్బిలి), మున్నం దేముడమ్మ (పెందుర్తి), ఆకోటి ధరణి (సాలూరు) అల్లు సావిత్రమ్మ (పార్వతీపురం), పి.కోటేశ్వరమ్మ (పార్వతీపురం)



ఆస్పత్రిలో క్షతగాత్రులు



క్షతగాత్రుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఏఎస్పీ రాణా

8న నాతవరంలో కలెక్టర్ స్పందన

- తొలిసారి మండల కేంద్రంలో నిర్వహణ

నాతవరం : ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఈనెల 8వ తేదీన మండల కేంద్రంలో కలెక్టరు రవి పట్టాన్‌శెట్టి ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ ఎస్.ఎస్.వి.శ్రీనివాస్‌నాయుడు చెప్పారు. ఆయన మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సోమవారం జిల్లా కలెక్టరు కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందేనన్నారు. ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువలో సేవలు అందించాలన్న లక్ష్యం మేరకు ఈసారి స్పందన కార్యక్రమం (జగనన్నకు చెబుదాం) నాతవరంలో జిల్లా స్థాయి అధికారుల సమక్షంలో నిర్వహించేందుకు నిర్ణయించారన్నారు. ఈ స్పందనలో కలెక్టరు, జాయింట్ కలెక్టరు, జిల్లా స్థాయి అధికారులంతా పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో నేరుగా కలెక్టరు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు. సమస్యలను అక్కడే సంబంధిత శాఖ అధికారితో మాట్లాడి పరిష్కారిస్తారన్నారు. స్పందనలో ఫిర్యాదుదారులకు రశీదు ఇవ్వడం జరుగుతుందని, దీనికోసం ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం ఈ స్పందన కార్యక్రమాన్ని మొదటగా జిల్లాలో నాతవరంలో నిర్వహించాలని కలెక్టరు నిర్ణయించారన్నారు. మండల ప్రజలు ప్రజాప్రతినిధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హనుమంతరావు, వివిధ శాఖలు అధికారులు పాల్గొన్నారు.

మత్తులో పడితే భవిష్యత్తు చిత్తు

- డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి
- విద్యార్థులకు జిల్లా ఎస్పీ మురళీకృష్ణ పిలుపు



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లిటౌన్ : డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఎస్పీ కె.వి. మురళీకృష్ణ అన్నారు. నషాముక్త భారత్ (డ్రగ్స్ ఫ్రీ ఇండియా) అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక డైట్ కళాశాలలో మంగళవారం బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, కళాశాల ఆవరణలో, పరిసరాల్లో ఎటువంటి డ్రగ్స్ వినియోగం విద్యార్థుల కంటపడినా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

మత్తు పదార్థాల నివారణకు సంబంధించి అన్నివర్గాల వారికి అవగాహన కల్పించేందుకు 138 అవగాహన కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. గంజాయి, డ్రగ్స్ అరికట్టేందుకు ఆపరేషన్ పరివర్తన కార్యక్రమం ప్రారంభించామన్నారు. గంజాయి రవాణాను అరికట్టేందుకు జిల్లాలో నాలుగు పర్మనెంట్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, ఏజెన్సీలో గంజాయి సాగు నిర్మూలనకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. గ్రామాల్లో ఎస్ఎస్ఎస్ ద్వారా డ్రగ్స్ రహిత సమాజం కోసం అవగాహన కల్పిస్తున్నట్టు కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ చెప్పారు. ఏపీ యాంటీ డ్రగ్స్ కన్వీనర్ సురేష్‌జాతా, డీఎంహెచ్‌వో ఎ.హేమంత్, డాక్టర్ సచిన్‌భాయ్, బ్రహ్మకుమారీ శివలీల, కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



గురువులకు గౌరవ సత్కారం : అనకాపల్లిలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకుంటున్న మాడుగుల మండలం నర్సయ్యపేట గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బావరాజు అప్పారావు, కశింకోట మండలం జి.భీమవరం ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం గంది దేముడుబాబు, యలమంచిలి మున్సిపాలిటీ వెంకటాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బి.వి.రాణి, నాతవరం మండలం చమ్మచింత హైస్కూల్ హెచ్‌ఎం కె.శివరాంప్రసాద్, గాంధీనగరం పాఠశాల హెచ్‌ఎం నానాజీ, నక్కపల్లి మండలం సిహెచ్.ఎల్.పురం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ , కొరుప్రోలు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సకురు సత్యనారాయణ, జోగంపేట ఎంపీపీఎస్ హెచ్‌ఎం కురచా వెంకటలక్ష్మి, చోద్యం జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం జి.రత్నాజీ



103 మందికి కారుణ్య నియామకాలు

రిక్రూట్‌మెంట్ ద్వారా 43 మంది నియామకం



నియామక పత్రాలను అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: ప్రభుత్వ ఉద్యోగులు నిజాయతీ, నిస్వార్థంగా సేవలందించాలని కలెక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు. పలు ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తూ మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కారుణ్య నియామక పత్రాలు అందించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో సాధారణ కారుణ్య నియామకాల కింద 70 మందికి, రెవెన్యూ శాఖలో 9 మందికి, గ్రామ సచివాలయాల్లో ముగ్గురికి, ఆర్టీసీలో 21 మందికి, రెవెన్యూ శాఖలో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్(గ్రూప్-4) ద్వారా ఎంపికైన 43 మంది జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్లకు నియామక పత్రాలు అందజేసినట్లు కలెక్టర్ తెలిపారు. వీరందరికీ కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపి.. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని సూచించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 436 మందికి నియామక పత్రాలు అందజేసినట్లు వెల్లడించారు. జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగం పొందిన వారు ప్రజలకు సేవ చేయాలని.. సమయపాలన పాటించాలన్నారు. డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, కలెక్టరేట్ కార్యాలయ పరిపాలన అధికారి కె.ఈశ్వరరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

8న స్థాయీ సంఘ సమావేశం



డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘం సమావేశం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన ఈ నెల 8న జరగనుంది. ఆ రోజు ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో 22 అంశాలను చర్చించనున్నారు. జోన్-2 పరిధి 8వ వార్డు తారకరామనగర్‌లో రూ.49.98 లక్షల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణం, జోన్-7లో 80 నుంచి 84వ వార్డు వరకు పారిశుధ్య నిర్వహణకు నియమించిన అదనపు సిబ్బందిని మరో 3 నెలలు కొనసాగించడం, జోన్-3 పరిధి 20వ వార్డు మానసిక ఆస్పత్రి జంక్షన్ నుంచి లెండివనం, ఆస్పత్రి డౌన్‌రోడ్డు వరకు రూ.49.65 లక్షల విలువలతో ప్రహరీ నిర్మాణం, జోన్-7 పరిధి 84వ వార్డు సాలపువానిపాలెం విలీన గ్రామం వద్ద రూ.27.70 లక్షలతో ఆర్‌సీసీ డ్రెయిన్, ఎస్‌డబ్ల్యూ డ్రెయిన్, ఆర్‌సీసీ కల్వర్టు నిర్మాణం, జోన్-7 పరిధి 83వ వార్డు సీతారాం కల్యాణ మండపం వేల్పుల వీధి వద్ద మేజర్ డ్రెయిన్‌పై ఆర్‌సీసీ కల్వర్టు కూల్చివేసి, రూ.41 లక్షలతో పునఃనిర్మాణంపై సభ్యులు చర్చించనున్నారు. 2022-23, 2023-24 ఏడాదికి ప్రజారోగ్య విభాగంలో పనిచేస్తున్న శాశ్వత పారిశుధ్య కార్మికుల కోసం రూ.39,8,139 అంచనాతో ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ విధానం ద్వారా కొబ్బరి నూనె కొనుగోలు, జోన్-4 పరిధి 32వ వార్డులో అభివృద్ధి పనుల్లో భాగంగా నాలుగు పనులు రద్దు చేస్తూ, ఆ స్థానంలో భీమ్‌నగర్ వద్ద జీ+1 తరహాలో కల్యాణ మండపం నిర్మాణం, జోన్-3 పరిధి 14 నుంచి 27వ వార్డు వరకు, బీచ్‌రోడ్డులో పారిశుధ్య నిర్వహణకు అదనపు సిబ్బంది నియామకం, జోన్-2 పరిధి 8వ వార్డులో సిల్వర్ ఓక్స్ స్కూల్ నుంచి ఒమ్మివానిపాలెం వంతెన వరకు తారు రోడ్డు పునరుద్ధరణ, జోన్-6 పరిధి 76వ వార్డులో భరత్‌నగర్ వద్ద మేజర్ డ్రెయిన్ నిర్మాణం, జోన్-3 పరిధిలో జీవీఎంసీ దుకాణాలు, కల్యాణ మండపాలు మూడేళ్ల పాటు లీజు, తదితర అంశాలు సభ్యుల ఆమోదానికి చర్చకు రానున్నాయి.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



సత్యవతి (ఫైల్)

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని అందలాపల్లికి చెందిన సత్యవతి(48) మంగళవారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. దీంతో కుటుంబీకులు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతోనే యువకుడి మృతి

చోడవరం రూరల్: మండలంలోని వెంకన్నపాలెం-ముద్దుర్తి జంక్షన్‌ల మధ్య అనకాపల్లి రోడ్డులో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతోనే యువకుడు మృతి చెందినట్టు చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. మండలంలోని అడ్డూరు గ్రామానికి చెందిన మృతుడు సానబోయిన దేముడుబాబు(25) అదే గ్రామానికి చెందిన యలమంచిలి శ్రీనివాసరావుకు చెందిన లారీ డ్రైవర్(ఏపీ31టీసీ1148)గా పని చేస్తున్నాడన్నారు. ఎప్పటిలాగే సోమవారం ఉదయం 9 గంటలకు లారీ తీసుకుని వెళ్లాడని, సాయంత్రం ముద్దుర్తి కొత్తపల్లిలో ఇటుకల లోడు కోసం వెళ్లాడన్నారు. ఈ క్రమంలో లారీకి డీజిల్ కోసం నంబారువానిపాలేనికి చెందిన తన స్నేహితుడు నంబారు దేముడునాయుడు బైకును తీసుకుని వెంకన్నపాలెం వైపునకు వస్తుండగా ప్రమాదానికి గురయ్యాడని పేర్కొన్నారు. మృతుడి తండ్రి దాలినాయుడు ఫిర్యాదు మేరకు ఐపీసీ 304ఎ (హిట్ అండ్ రన్) సెక్షన్ కింద కేసు నమోదు చేశామని, ప్రమాదానికి కారణమైన వాహనం ఆచూకీ కోసం సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నామని తెలిపారు.


ట్రాక్టర్‌పై నుంచి జారిపడి డ్రైవర్ మృతి

- యానాద్రి కాలనీ వద్ద ఘటన



యలమంచిలి: మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్‌పై నుంచి అదుపుతప్పి కింద పడిపోవడంతో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన యలమంచిలి మున్సిపాలిటీ యానాద్రి కాలనీ వద్ద మంగళవారం చోటు చేసుకుంది. పట్టణ ఎస్సై పాపినాయుడు వివరాల ప్రకారం.. యలమంచిలి ఫైరాఫీస్ కాలనీకి చెందిన డ్రైవర్ కాశీందేవుని వీరునాయుడు(42) మట్టి లోడు ట్రాక్టర్‌ను రోడ్డు పక్కన గుంతలో అజాగ్రత్తగా నడపడటంతో దానిపై నుంచి కింద పడిపోయాడు. వెంటనే ట్రాక్టర్ వెనుక చక్రాల కింద నలిగిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అందించారు. మృతుడు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

శారదానదిలో పడి వృద్ధుడి మృతి



నీటిలో తేలియాడుతున్న వృద్ధుడి మృతదేహం

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాది శారదానదిలో వృద్ధుడు మృతదేహం బయటపడింది. మృతుడు మాడుగుల మండలం వీరవల్లికి చెందిన సయ్యపురెడ్డి నరసింహదొర(70)గా స్థానికులు గుర్తించారు. మంగళవారం మధ్యాహ్నం వడ్డాది రాళ్లకట్టు వద్ద శారదా నదిలో గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. ఎస్‌ఐ కె. కుమారస్వామి తమ సిబ్బందితో అక్కడకు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఉదయం గ్రామంలో బహిర్భూమికి వెళ్లాడని, ఇంటికి తిరిగి రాకపోవడంతో వెతుకుతున్నామని, ఇంతలో విగతజీవిగా మారడంతో విలపించారు. మృతుడికి భార్య నాగమణి, వివాహమైన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువతికి గాయాలు



చికిత్స పొందుతున్న యువతి

మాడుగుల: స్థానిక అగ్నిమాపక కేంద్రం వద్ద మంగళవారం సాయంత్రం ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో యువతికి గాయాలయ్యాయి. పాడేరు నుంచి మాడుగుల మీదుగా స్కూటీపై వస్తున్న యువతి జన్ని దాబురాను ఎదురుగా వస్తున్న బైక్ ఢీ కొట్టడంతో ఆమెకు తలపై, మోకాలిపై గాయాలయ్యాయి. వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం అనకాపల్లిలో ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్‌ఐ దామోదరనాయుడును సంప్రదించగా ఫిర్యాదు అందలేదన్నారు.

ఉపాధ్యాయులను గౌరవించాలి

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఉపాధ్యాయులు

రోలుగుంట: విద్యార్థుల్లో అజ్ఞానాన్ని తొలగించి, జ్ఞానాన్ని ప్రసాదించే ఉపాధ్యాయులను గౌరవించి, వారి ఆశీస్సులు పొందాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. హెచ్‌ఎం వరప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురు పూజోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రభుత్వ విప్ ధర్మశ్రీ ముందుగా ఇక్కడ ఆవరణలో సరస్వతీదేవి విగ్రహానికి పూల మాల వేశారు. తర్వాత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఉపాధ్యాయులతో కలసి నివాళులర్పించారు. అనంతరం సభలో ఆయన మాట్లాడుతూ సమాజంలో గురువు ప్రాముఖ్యత గురించి చాటి చెబుతూ, అన్ని రంగాల అభివృద్ధికి విద్యే ప్రధానమన్నారు. రాధాకృష్ణన్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించి దేశాభివృద్ధికి పాటుపడాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు రమాకుమారి, శ్రీరామ్మూర్తి, శర్మ తదితరులను విప్ ధర్మశ్రీ ఘనంగా సన్మానించారు. ఎంఈవో -2 జగ్గారావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ టి.వి.రమణ, యర్రంశెట్టి రాజారావు, గొర్లె చెల్లమనాయుడు, మడ్డు అప్పలనాయుడు, కొల్లు సన్యాసినాయుడు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

- యలమంచిలి పాఠశాలను సందర్శించిన డీఈవో వెంకటలక్ష్మమ్మ



డీఈవో వెంకటలక్ష్మమ్మను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

యలమంచిలి: విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించాలని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. యలమంచిలి పట్టణం స్టేషన్ రోడ్డులో జెడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆమె సందర్శించారు. పాఠశాల పరిసరాలను, తరగతి గదులను పరిశీలించారు. ప్రభుత్వం అందించిన బైజూస్ ట్యాబ్‌ల వినియోగంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠ్యాంశాల్లో కొన్ని ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. నోటు పుస్తకాలు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. ట్యాబ్‌ల ద్వారా సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులను నిరంతరం పర్యవేక్షణ చేయాలని, అభ్యసనల్లో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బోధించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఐఎఫ్‌పీ బోర్డులు, టీవీల వినియోగంతో బోధన చేయాలని సూచించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థకు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొన్నారు. ఉపాధ్యాయులు డీఈవోను ఘనంగా సత్కరించారు. ఎంఈవో మీనాక్షి, ప్రధానోపాధ్యాయుడు విశ్వేశ్వరావు, ఉపాధ్యాయులు భవానీ, నాగేశ్వరరావు, మూర్తి, ఫ్లోరెన్స్ పాల్గొన్నారు.

15లోగా ఈ - క్రాప్ పూర్తి చేయాలి

- నెలాఖరులోగా ఈ- కేవైసీ పూర్తి
- మాడుగుల నియోజకవర్గంలో జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు ఆకస్మిక తనిఖీలు



కలిగొట్ల పొలాల్లో పంటల నమోదును పర్యవేక్షిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు

మాడుగుల/కె.కోటపాడు/దేవరాపల్లి/చీడికాడ: ఖరీఫ్ పంటల నమోదు పట్ల నిర్లక్ష్యం వహించకుండా ఈ నెల 15వ తేదీ లోగా పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి బి. మోహన్‌రావు సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు మాడుగుల నియోజకవర్గంలో ఆయన క్షేత్రస్థాయిలో సందర్శించి ఈ -క్రాప్ నమోదును ఆకస్మికంగా తనిఖీలు చేశారు. దేవరాపల్లి మండలం కొత్తపెంట, బోయిలకింతాడ, కలిగొట్ల, కె.కోటపాడు మండలం మేడిచర్ల, చీడికాడ మండలం అర్జునగిరి, జి.కొత్తపల్లి, జైతవరం, ఖండివరం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులను పంటల నమోదు సక్రమంగా చేపడుతున్నారా లేదా అని ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతు భరోసా సొమ్ముతో పాటుగా పీఎం కిసాన్ సొమ్ము జమ కావాలంటే ఈ నెలాఖరులోగా ఈ- కేవైసీని పూర్తి చేయాలని వ్యవసాయశాఖ సిబ్బందికి సూచించారు. భూమికి ఆధార్ లింక్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఈ కారణంగానే పీఎం కిసాన్ కొందరికీ జమ కావడం లేదన్నారు. పట్టాదారు పాసు పుస్తకం కలిగిన ప్రతీ రైతు పొలంలో ఏయే పంటలు ఎంత విస్తీర్ణంలో వేశారో స్థానిక ఆర్బీకేలో నమోదు చేసుకోవాలని సూచించారు. భూమి యజమాని మరణ ధ్రువీకరణ పత్రాన్ని ఆర్బీకేలో సమర్పిస్తే పోర్టల్‌లో ఆ వ్యక్తి వివరాలను తొలగించి నామినీ వివరాలను నమోదు చేస్తామన్నారు. మాడుగుల ఆర్బీకేలో సిబ్బందితో సమావేశమై ఆయన మాట్లాడారు. ఈ క్రాప్ నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు తెలియజేయాలన్నారు. ఏవోలు పి.సోమశేఖర్, వాసుదేవరావు, ఏ కృష్ణవేణి, వైఎల్. కాంతమ్మ, విస్తరణాధికారులు సత్యనారాయణ, ఎస్. కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

మానవ సంబంధాలు బలోపేతం

- దామోదరం సంజీవయ్య లా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ శ్రీసుధ



దామోదరం సంజీవయ్య లా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ శ్రీసుధను సన్మానిస్తున్న దృశ్యం

చోడవరం: ప్రతి ఒక్కరూ మానవ సంబంధాలు పెంచుకోవాలని దామోదరం సంజీవయ్య లా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ పి. శ్రీసుధ తెలిపారు. వాసవి, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో మంగళవారం చోడవరంలో వనిత సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మానవ సంబంధాలు ఇటీవల కాలంలో ఆర్థిక బంధాలుగా మారుతున్నాయని వాపోయారు. దీనివల్ల కుటుంబ వ్యవస్థ దెబ్బతింటుందన్నారు. కుటుంబాల్లో సభ్యులంతా నిబద్ధతతో కూడిన బంధాలతో అనుబంధంగా కలిసి మెలసి ఉంటే ఆ కుటుంబాలు మరింతగా బలపడతాయన్నారు. పిల్లలు, తల్లిదండ్రుల మధ్య బంధాలు దూరమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులే నిజమైన ఆస్తిగా గుర్తించుకుని, వారిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వృద్ధులను అనాథలుగా వదిలేయకుండా వారిని కుటుంబ పెద్దలుగా గౌరవించి జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, తమ హక్కులు, బాధ్యతలు తెలుసుకోవాలని కోరారు. అనంతరం వివిధ సాంస్కృతిక, ఫ్యాషన్ షో కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆట పాటలతో వనితా క్లబ్ ప్రతినిధులంతా సందడి చేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ పీఎస్ వరహాలరావు, వనితా క్లబ్ అధ్యక్షురాలు పి. పద్మిని, డాక్టర్ మురళీధర్, మసుమర్తి అశోక్, ఎస్.వి. మాధవ్, లక్ష్మణరావు, ఉప్పల రామకృష్ణ, భోగవిల్లి గణేష్ పాల్గొన్నారు.

కుమారుడి అనుమానాస్పద మృతిపై తల్లి ఫిర్యాదు

అచ్యుతాపురం (అనకాపల్లి): తన కుమారుడి మరణం అనుమానాస్పదంగా ఉందని అచ్యుతాపురం మండలం పూడి ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన పెదపాటి నాగరత్నం మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. పూడి ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన పి.నాగరత్నంకు కుమారుడు ఈశ్వరరావు(28)తో పాటు మరో కుమార్తె ఉంది. ఆగస్టు 3వ తేదీన ఉదయం వారి ఇంటి మెట్లపై ఈశ్వరరావు మృతి చెంది పడి ఉండడంతో స్థానిక పెద్దలు అంత్యక్రియలు నిర్వహించారు. అయితే నాగరత్నంకు తన కుమారుని మృతిపై అనుమానాలు కలగడంతో మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గత నెల రెండో తేదీ సాయంత్రం ఈశ్వరరావు తన స్నేహితులతో కలిసి వెళ్లాడని, ఉదయం నాటికి మృతి చెంది ఉండడంతో ముందుగా తమకు ఎవరిపైనా అనుమానం కలగకపోవడంతో ఫిర్యాదు చేయలేదని, కానీ ఇప్పుడు తమకు అనుమానం ఉన్నందున దర్యాప్తు జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని మృతుడి తల్లి, సోదరి పోలీసులను కోరారు.

పెన్షనర్ల పే రివిజన్‌కు కృషి



మాట్లాడుతున్న రాజ్యసభ ఎంపీ జీవీఎల్ నరసింహారావు

సీతంపేట: ఆల్ ఇండియా బీఎస్‌ఎన్‌ఎల్ పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక పౌరగ్రంథాలయంలో మంగళవారం ఉమ్మడి విశాఖ జిల్లా ఆత్మీయ సమావేశం జరిగింది. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుప్పిలి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఏడో వేతన సంఘం సిఫార్సులకు అనుగుణంగా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్లకు పే రివిజన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం సుమారు 4 లక్షల మంది బీఎస్‌ఎన్‌ఎల్ పెన్షనర్లు 2017 నుంచి ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా రాజ్యసభ ఎంపీ జీవీఎల్ నరసింహారావుకు వినతి పత్రం అందజేయగా.. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. పెన్షన్ రివిజన్‌పై ఇదివరకే కేంద్ర కమ్యూనికేషన్ మంత్రికి లేఖ రాశానని గుర్తు చేశారు. మరోసారి కేంద్ర మంత్రితో సమావేశమై పే రివిజన్ అమలుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.ఆర్.పటాన్నాయక్, సీనియర్ సభ్యులు వి.ఆర్.కె.శర్మ, ఆర్.ఎస్.ఎస్.మూర్తి, అధిక సంఖ్యలో పెన్షనర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గాంధీనగరంలో 'గడప గడపకు' నేడు

అనకాపల్లిటౌన్: స్థానిక గాంధీనగరం అంజయ్యకాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ బీవీ సత్యవతి హాజరవుతారని పేర్కొన్నారు. అధికారులు, స్థానిక పార్టీ శ్రేణులు హాజరుకావాల్సిందిగా కోరారు.

పంచాయతీ కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా

తుమ్మపాల: తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలంటూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పంచాయతీ కాంట్రాక్ట్ కార్మికులు కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా చేశారు. పంచాయతీల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులనందరిని పర్మినెంట్ చేస్తామని సీఎం ఇచ్చిన హామీని నెరవేర్చాలని పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఉమ్మడి జిల్లాల కార్యదర్శి గనిశెట్టి ఏసుదాసు, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ వైఎన్ భద్రం కోరారు. కార్మికుల వేతనాలు సకాలంలో చెల్లించాలన్నారు. కార్మికుల పలు సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కరించాలని కోరుతూ, జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు తాకాశి వెంకటేశ్వరరావు, నాయుడు, పరదేశి, ముప్పిడి రామచంద్రరావు, ఏ నాగేశ్వరరావు, రామకృష్ణ, ఎస్.అప్పారావు, సత్తిబాబు పాల్గొన్నారు.

తోడపెద్దు మృతి


మృతి చెందిన తోడపెద్దు

కశింకోట: అనారోగ్యంతో కశింకోటలోని దేవర వీధిలో తోడపెద్దు మంగళవారం మృతి చెందింది. వారం రోజుల క్రితం ఒంగోలు నుంచి ఎద్దును తీసుకు వచ్చి, అచ్చుపోత కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించి తోడపెద్దుగా చేసి గ్రామంలో ఊరేగించిన విషయం తెలిసిందే. అయితే రెండు రోజుల క్రితం తోడపెద్దు అనారోగ్యానికి గురి కావడంతో పశు వైద్యునితో వైద్యం చేయించారు. అయినప్పటికి ప్రయోజనం లేక మృతి చెందింది. దీంతో యాదవ సంక్షేమ సంఘం ప్రతినిధులు తోడపెద్దును ఊరేగించి, సమాధి చేసి పూజలు నిర్వహించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 141 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,250	4,410
రెండో రకం	4,170	4,190
మూడోరకం	3,900	4,160

అనకాపల్లి సినిమాలు

మిస్టిక్ (ఉదయం, సాయంత్రం)	
బేబి (మ్యాట్నీ, రాత్రి)	:రాజా
ఏం చేస్తున్నావ్	:సత్యనారాయణ స్క్రీన్-1
ద ఈక్వెలైజర్ 3	:సత్యనారాయణ స్క్రీన్-2
జైలర్	:షిర్డిసాయి
ఖుషి	:పర్తిసాయి
బెదురులంక 2012	:వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్	:శ్రీసత్య
ఖుషి	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 93 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-14 యూనిట్లు, బీ పాజిటివ్-35 యూనిట్లు, బీ నెగిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-35 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు, ఏబీ నెగిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 487 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 447 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

ఉత్తమ గురువులకు పురస్కారం

అజ్ఞాన తిమిరాన్ని పారద్రోలి విజ్ఞాన జ్యోతుల్ని వెలిగించేది గురువు. తను నాలుగు గోడల మధ్యనున్న తరగతి గదిలో ఉంటూ విద్యార్థులకు ప్రపంచాన్ని పరిచయం చేసేది గురువు. వృత్తులు, ఉద్యోగాలెన్ని ఉన్నా.. వాటన్నింటికీ ప్రధాన కర్త గురువు. అలాంటి గురువుల్లో కొందరిని ఈ ఉపాధ్యాయ దినోత్సవాన ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం గౌరవించింది. ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలతో సత్కరించింది.


జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకుంటున్న తాళ్లపాలెం హైస్కూల్ స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుడు కొరుప్రోలు వెంకటేశ్వరరావు


కలెక్టర్, ఎంపీల నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకుంటున్న వెదురుపర్తి హైస్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయుడు బోయిన చిన్నారావు

కశింకోట: మండలానికి చెందిన పలువురు ఉపాధ్యాయులు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను పొందారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం అనకాపల్లిలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎంపీ బీవీ సత్యవతిల చేతుల మీదుగా వీరు ఈ పురస్కారాలను అందుకున్నారు. వెదురుపర్తి జెడ్పీ హైస్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయుడు బోయిన చిన్నారావు, తాళ్లపాలెం హైస్కూల్ స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుడు కొరుప్రోలు వెంకటేశ్వరరావు, జి.భీమవరం ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం గండి దేముడుబాబులు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందారు. పురస్కారాలు పొందిన ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఈ గుర్తింపు తమ బాధ్యతను మరింతగా పెంచిందన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తామని పేర్కొన్నారు. వీరిని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ, తాళ్లపాలెం, వెదురుపర్తి హైస్కూళ్ల హెచ్ఎంలు విజయలక్ష్మి సుమన్, జీవీకే ఆచారి, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

● మండలంలోని వెదురుపర్తి హైస్కూల్లో ఇద్దరు ఆంగ్ల ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు లభించాయి. స్కూల్ అసిస్టెంట్లు సబిత లక్ష్మికి రాష్ట్ర స్థాయి, బోయిన చిన్నారావుకు జిల్లా స్థాయి అవార్డులు దక్కాయి. ఈ మేరకు లక్ష్మి విశాఖ ఆంధ్రా యూనివర్సిటీలోను, చిన్నారావు అనకాపల్లిలోను పురస్కారాలు అందుకున్నారు.

● మండలంలోని తేగాడ గ్రామం వద్దనున్న ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో సోషల్ స్టడీస్ టీజీటీగా పని చేస్తున్న ఆకెళ్ల రోహిణి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా మంగళవారం పురస్కారం పొందారు. జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి చేతుల మీదుగా జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఆమెకు పురస్కారం రావడం పట్ల ప్రిన్సిపాల్ ఐ.మార్తా తిలకం, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.


జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు గణపతి


ఉత్తమ ఉపాధ్యాయిని ఆకెళ్ల రోహిణి

అనకాపల్లిటౌన్: మండలంలోని సుందరయ్యపేట పాఠశాల ఉపాధ్యాయుడు కేవీవీ గణపతికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం మంగళవారం లభించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.గౌరినాయుడు, ఉపాధ్యాయులు గ్లోరియానా, శ్రీను, రాజ్యలక్ష్మి, స్థానికులు ఆయన్ని అభినందించారు.

ఉపాధ్యాయునితోనే సమాజంలో మార్పు


ప్రతిభ చూపిన అధ్యాపకురాలికి ప్రశంసాపత్రం అందిస్తున్న శ్రీసుధ, కళాశాల చైర్మన్ రత్నాకర్


గవరపాలెం జీవీఎంసీ హైస్కూల్లో సర్వేపల్లి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రమణ అప్పారావు, సిబ్బంది


కశింకోటలోని సెయింట్ జాన్స్ స్కూల్లో విద్యార్థుల నృత్య ప్రదర్శన

● ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

అనకాపల్లిటౌన్: భారతదేశానికి రెండవ రాష్ట్రపతిగా పనిచేసిన వ్యక్తి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అని, ఆయన జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్‌ఛాన్సలర్ పి.శ్రీసుధ అన్నారు. మంగళవారం స్థానిక డైట్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో మార్పు రావాలంటే ఉపాధ్యాయుడితోనే సాధ్యమన్నారు. పాశ్చాత్యదేశాల కంటే మన దేశంలో ఉపాధ్యాయులు ఏమీ ఆశించకుండా విద్యను బోధిస్తారన్నారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల వలనే దిగ్గజాలు తయారవుతారన్నారు. భావి పౌరులందరికీ విజ్ఞానాన్ని అందిస్తూ దిశానిర్దేశం చేయడంలో, జాతి నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. అంతకుముందు అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన అధ్యాపకులకు వెండి పతకాలు, ప్రశంసాపత్రాలు, నగదు ప్రోత్సాహకాలు అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు, వివిధ విభాగాధిపతులు, బోధనా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గవరపాలెం జీవీఎంసీ స్కూల్లో..

స్థానిక గవరపాలెం జీవీఎంసీ హైస్కూల్లో అబ్దుల్ కలాం సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమాలు జరిగాయి. గురువు ఎక్కడ పూజింపబడతాడో అక్కడి విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణ అప్పారావు అన్నారు. నాడు-నేడు పథకంలో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దడంతో పాటు, అమ్మ ఒడి, ఫీజురియింబర్స్‌మెంట్ వంటి పథకాలతో పేదలకు మెరుగైన విద్యా బోధనను అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనని కొనియాడారు. అంతకుముందు సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలు పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.సూర్యనారాయణ, కె.జనార్దన్, పీటీ పూర్ణిమ, కిశోర్, శివరామకృష్ణ, వేణుగోపాల్, దుర్గాప్రసాద్, సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి అములోజు శ్రీను, కార్యదర్శి కొణతాల రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

కశింకోట: స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్లో మంగళవారం గురు పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ఉపాధ్యాయులను సత్కరించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. స్కూల్ డైరెక్టర్ బత్తుల నోబుల్ కుమార్, కరస్పాండెంట్ బత్తుల అనురాధ, ప్రిన్సిపాళ్లు రూపానంది, శ్రావణి, అకడమిక్ ఇన్‌చార్జి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై గడ్డి కోత యంత్రం అందజేత


గొబ్బూరులో పాడి రైతుకు గడ్డి కోత యంత్రం అందిస్తున్న పశు వైద్యాధికారి చైతన్యమణి

కశింకోట: పాడి రైతులకు గడ్డి కోత యంత్రాన్ని 40 శాతం రాయితీపై ప్రభుత్వం అందిస్తోందని, దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని నరసింగబిల్లి పశు వైద్య కేంద్రం వైద్యాధికారి చైతన్యమణి కోరారు. మండలంలోని గొబ్బూరు గ్రామంలో పాడి రైతు భీశెట్టి మహాలక్ష్మినాయుడుకు మంజూరైన 2 హెచ్‌పీ సామర్థ్యం ఉన్న గడ్డి కోత యంత్రాన్ని మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైతన్యమణి మాట్లాడుతూ గడ్డి యంత్రం పూర్తి ధర రూ.33,790 అని, ప్రభుత్వం ఇచ్చే 40 శాతం రాయితీపోగా రైతు రూ.20,382 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ యంత్రం సాయంతో గడ్డిని ముక్కలుగా చేసి మేతగా వేయడం వల్ల పశువులు ఇష్టంగా తింటాయన్నారు. గడ్డి వృథా కాదని, సాధారణం కంటె 15 శాతం అదనంగా గడ్డిని తింటాయన్నారు. దీంతో 10 శాతం వరకు పాల దిగుబడి పెరుగుతుందన్నారు. ముక్కలు చేసిన పశు గ్రాసంలో ఖనిజ లవణాలు, విటమిన్లు, మొలాసిస్ వంటివి కలపడం కూడా తేలిక అవుతుందన్నారు. రుచి కూడా పెరుగుతుందన్నారు. సర్పంచ్ మళ్ల మణి మాట్లాడుతూ గత నాలుగేళ్లలో రైతు సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు కార్యక్రమాలు అమలు చేసి, ఆదుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో చింతలపాలెం పశు వైద్య సహాయకురాలు రూపవతి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన నేడు

అనకాపల్లిటౌన్: పట్టణంలో పలు చోట్ల చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ బుధవారం శంకుస్థాపన చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 లక్షలతో తారురోడ్డు, ఫుట్‌పాత్, లైటింగ్, బీటీరోడ్డు విస్తరణ పనులకు ఆయన చేతుల మీదుగా శంకుస్థాపన జరపనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి పార్టీ శ్రేణులు హాజరు కావాలని కోరారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత


మృతుని కుటుంబ సభ్యులకు రూ.10 వేలు అందిస్తున్న జాజుల రమేష్

అనకాపల్లిటౌన్: రోడ్డు ప్రమాదంలో మరణించిన స్థానిక లోకావారివీధికి చెందిన మాడెం రాజ్‌కుమార్ కుటుంబ సభ్యులకు 83వ వార్డు ఇన్‌చార్జి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి జాజుల రమేష్ వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలు అందించారు. రాష్ట్ర మంత్రి అమర్‌నాథ్ సూచనల మేరకు మృతుని కుటుంబాన్ని మంగళవారం ఆయన పరామర్శించారు. వైఎస్సార్ బీమా రూ.5 లక్షల్లో మిగిలిన మొత్తం కుటుంబ సభ్యుల ఖాతాకు జమ అవుతుందని, ఆ కుటుంబానికి భరోసానిచ్చారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగి గంగ అప్పారావు, వెల్ఫేర్ అసిస్టెంట్ మహాలక్ష్మి, సచివాలయ కన్వీనర్ సోమిశెట్టి భాస్కర్, వలంటీర్లు లీలారాణి, హేమలత, వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఉగ్గిన అప్పారావు, గొర్లి చిన్న, గుమ్మాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సేవలు ప్రశంసనీయం


ఆశా వర్కర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లి రూరల్: గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ కార్యకలాపాల్లో ఆశా వర్కర్లు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మంగళవారం ఆశా డే సందర్భంగా తగరంపూడి పీహెచ్‌సీలో ఆశా వర్కర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఆశాలు అందిస్తున్న సేవలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. ఆశా కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. సమావేశంలో గ్రామ సర్పంచ్ యాదగిరి అప్పారావు, వెంకుపాలెం సర్పంచ్ రాపేటి నాగేశ్వర్రావు, ఎంపీటీసీ రాపేటి వెంకటేష్, అయితా ఆనంద్, రాము, డిప్యూటీ డీఎంహెచ్‌వో, వైద్యులు, ఏఎన్ఎంలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సుందరయ్యపేట హైస్కూల్ తనిఖీ..

మండలంలోని సుందరయ్యపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపీపీ మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాలలో జగనన్న జగనన్న గోరుముద్ద పథకం మెనూ అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులకు పెడుతున్న ఆహార పదార్థాల నాణ్యత, రుచిని గురించి ఆరా తీశారు. ఉపాధ్యాయులకు గురుపూజోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

పోషకాహారంతో ఆరోగ్యం


బాలింతలకు బహుమతి అందిస్తున్న వైస్ ఎంపీపీ అప్పలరాజు

పరవాడ: వాడచీపురుపల్లి శివారు పందివానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషకాహార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులకు పోషకాహార విలువల గురించి వివరించారు. వెల్‌బేబీ షోలో వయస్సుకు తగ్గ బరువు ఉన్న వారిని ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. కూరగాయలు, ఆకుకూరలు, చిరుధాన్యాలు, తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవాలని వైస్ ఎంపీపీ అప్పలరాజు సూచించారు. కార్యక్రమంలో సబ్బవరం సీడీపీవో లలిత్‌కుమారి, సూపర్‌వైజర్ ఉమా, లంకెలపాలెం పీఏసీఎస్ చైర్మన్ బురద రాజు, ఉప సర్పంచ్ కె.శ్రీను, అంగన్‌వాడీ కార్యకర్తలు కె.కనకలక్ష్మి, ఎం.అమ్మాజీ, పి.ప్రభావతి, ఆర్.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భోజన నాణ్యతలో రాజీపడొద్దు


పాఠ్య పుస్తకంలో పద్యాలపై ప్రశ్నిస్తున్న సూరిబాబు

అనకాపల్లిటౌన్: విద్యార్థులకు నాణ్యతగల భోజనాన్ని అందించాలని, నాణ్యతలో రాజీపడితే సహించేది లేదని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలోని తగరంపూడి మండల పరిషత్ స్కూల్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉపాధ్యాయులు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అంతకు ముందు ఆయన విద్యార్థులకు అందించే భోజనాన్ని రుచి చూసి, సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల పరిశీలనలో భాగంగా పాఠ్య పుస్తకంలోని పద్యాలను విద్యార్థులతో చదివించారు. ఆయన వెంట సర్పంచ్‌లు యాదగిరి అప్పారావు, రాపేటి నాగేశ్వరరావు, ఎంపీటీసీ రాపేటి వెంకటేష్, వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు వై.శ్రీనివాసరావు, పార్టీశ్రేణులు అయితా ఆనంద్, రాము పాల్గొన్నారు.

డ్రైనేజీ పనుల పరిశీలన


డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జానకీరామరాజు

అనకాపల్లిటౌన్: అనకాపల్లిని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అహర్నిశలు శ్రమిస్తున్నారని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అన్నారు. 82వ వార్డు పరిధి శారదాకాలనీలో జీవీఎంసీ నిధులతో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో డ్రైనేజీ, రహదారి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఆయన వెంట స్థానిక నాయకుడు గైపూరి రాజు ఉన్నారు.

జాతి నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలకం


బ్రహ్మానందంను సత్కరిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్: జాతి నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమని సర్వేపల్లి రాధాకృష్ణన్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ అన్నారు. కళాశాల ఆవరణలో మంగళవారం గురుపూజోత్సవం కార్యక్రమాన్ని ఆయన జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్పదని కొనియాడారు. అంతకు ముందు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఆర్.బ్రహ్మానందంను శాలువా వేసి, ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కోరిబిల్లి నాయుడు, అధ్యాపకులు జగదీష్, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఐ తిరుపతి సభను జయప్రదం చేయండి


గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

అనకాపల్లి రూరల్: దేశాన్ని కాపాడండి.. రాష్ట్రాన్ని రక్షించండి నినాదంతో సీపీఐ చేపట్టిన రాష్ట్ర వ్యాప్త బస్సు యాత్ర ముగింపు సందర్భంగా తిరుపతిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా నేతలు మంగళవారం సీపీఐ కార్యాలయంలో ముగింపుసభ గోడ పత్రికను ఆవిష్కరించారు.

ప్రభుత్వరంగ సంస్థలను కేంద్రం కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతోందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు ఆరోపించారు. కేంద్ర పెద్దలు కులాలు, మతాల పేరుతో ప్రజలను విభజించి దేశంలో అశాంతికి కారణమవుతున్నారని ఆక్షేపించారు. తిరుపతిలో జరిగే సభకు దేశానికి చెందిన పలువురు అగ్రనేతలు హాజరవుతారన్నారు. ప్రజాస్వామ్యవాదులు, పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వియ్యపు రాజు, కోరిబిల్లి శంకర్రావు, సత్యనారాయణ, ఈశ్వర్రావు, సూరిబాబు, రమణ పాల్గొన్నారు.

ఇరువర్గాల ఫిర్యాదు.. కేసు నమోదు

అనకాపల్లిటౌన్: ఇరువర్గాలు ఘర్షణ పడి, పట్టణ పోలీసులను మంగళవారం ఆశ్రయించారు. పట్టణ సీఐ దాడి మోహన్‌రావు అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చిన్నిబాబు కాలనీకి చెందిన కృష్ణశ్రీహర్షన్‌కు బెంగళూరు కోలార్‌కు చెందిన శ్రీహర్షిత అనే మహిళతో 2020లో వివాహమైంది. గత ఏడాదిల భార్యాభర్తలిద్దరూ విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. ఈ నెల 4న వాయిదా కావడంతో న్యాయ స్థానానికి ఇరు కుటుంబాల పెద్దలు హాజరయ్యారు. అక్కడ ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి, ఘర్షణ మొదలయింది. హర్షన్ తల్లి వసంత, హర్షిత తల్లి గాయత్రిలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు సత్కారం


సత్కారం పొందిన ఉపాధ్యాయులు

అచ్యుతాపురం(అనకాపల్లి): మండలంలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు మంగళవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు స్థానిక పేరెంట్స్ కమిటీ సాయంతో కృషి చేయాలని సబ్బవరపు నూకరాజు అన్నారు. ఎంఈఓ దేవరాయలు చేతుల మీదుగా ఎస్.శ్రీనివాస్‌రాజు, సత్యనారాయణ, పి.రేఖ, కుమారి, జి.శాంతిలను సత్కరించారు.